నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, ఆదివారం 16 మార్చి 2025 | YADADRI BHUVANAGIRI

వడపర్తిలో నీటి సరఫరాకు చర్యలు

యాదాద్రి భువనగిరి, మార్చి 15 (నమస్తే తెలంగాణ) : భువనగిరి మండలంలోని వడపర్తి గ్రామంలో నీటి సమస్య లభించింది. 'వడపర్తి.. దాహార్తి' శీర్షికన ఈ నెల 14న నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి స్పందించారు. తన సొంత నిధులతో తాజా మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ భువనగిరి మండలాధ్యక్షుడు ఎలిమినేటి కృష్ణారెడ్డిని పురమాయించి శుక్రవారం రాత్రి బోరు వేయించారు. మోటార్ బిగించి పైప్‌లైన్ కనెక్షన్ ఇస్తే గ్రామస్తులకు నీటి ఇక్కట్లు తీరనున్నాయి.

వడపర్తిలో బోరు వేయిస్తున్న తాజా మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జంగిలి మారయ్యకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు

గులాబీ కండువా కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్

శాలిగౌరారం మార్చి 15 : కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక ఆ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ అన్నారు. సూర్యాపేట జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామపంచాయతీ పరిధిలోని జోలంవారిగూడేనికి చెందిన సీనియర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జోలం సత్తయ్య, కాంగ్రెస్ పార్టీ వల్లాల గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు జంగిలి మారయ్యతోపాటు కుటుంబాల కార్యకర్తలు శనివారం మాదారంకలాన్ గ్రామంలో కిశోర్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గాదరి కిశోర్ మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో చేరిన వారంతా కలిసి మెలిసి పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్, నాయకులు కట్టా వెంకట్‌రెడ్డి, మామిడి సర్వయ్య, మాజీ సర్పంచ్ జెర్రిపోతుల మంజులాచంద్రమౌళిగౌడ్, గుజిలాల్ శేఖర్ బాబు, భూపతి ఉపేందర్‌గౌడ్, బీఆర్ఎస్ వల్లాల గ్రామ శాఖ అధ్యక్షుడు గుండ్లపెల్లి రవీందర్, గట్టయ్య, చింతల శంకర్, అశోక్‌రెడ్డి, నోముల శ్రీనివాస్, వాక సత్యనారాయణ, సకినాల నర్సయ్య, యామగాని వెంకన్న, నూక జానయ్య, రాచకొండ గణేశ్, వంశీ, నోముల పరమేశ్, యాకన్నచారి, మైబు పాల్గొన్నారు.

సూర్యాపేట రూరల్ : మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం ఆధ్వర్యంలో ఇమాంపేటలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భువనగిరి పట్టణంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై ఊరూవాడ రణం

ఎగిసిపడుతున్న ఆగ్రహ జ్వాలలు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొనసాగిన నిరసనలు
- మూడో రోజూ ర్యాలీలు, రాస్తారోకోలు
- ఎక్కడికక్కడ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం
- సూర్యాపేట నియోజకవర్గంలో ఊరూరా నిరసనలు
- గంట వ్యవధిలో 60కిపైనే..
- సస్పెన్షన్ ఎత్తివేయాలని బీఆర్ఎస్ నేతల డిమాండ్

సూర్యాపేట, మార్చి 15 (నమస్తే తెలంగాణ)/భువనగిరి అర్బన్ : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెన్షన్ చేయడంపై ఆగ్రహ జ్వాలలు ఎగిసిపడుతూనే ఉన్నాయి. మూడో రోజైన శనివారమూ ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. ఊరూవాడ ర్యాలీలు, రాస్తారోకోలు, దిష్టిబొమ్మల దహనాలు, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తాయి. సూర్యాపేట జిల్లాకేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున రోడ్డుపైకి వచ్చారు. భారీ బైక్ ర్యాలీగా అంబేద్కర్ విగ్రహం వరకు వచ్చి బాబాసాహెబ్‌కు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మాజీ మున్సిపల్ వైస్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ మాట్లాడుతూ దళిత స్పీకర్‌ను అవమానించారనే నెపంతో ప్రశ్నించే గళాన్ని నొక్కేయడం దుర్మార్గమన్నారు. పదేండ్లు మంత్రిగా, ప్రస్తుతం ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి దళితుల అభ్యున్నతికి ఎంతో చేశారని గుర్తుచేశారు. ఆత్మకూర్.ఎస్ మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. మండల కేంద్రంలో రాస్తారోకో చేయడంతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. సూర్యాపేట, పెన్‌పహాడ్ మండలాల్లోని ప్రతి ఊళ్లోనూ బీఆర్ఎస్ నాయకులు రోడ్లపైకి వచ్చి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పెన్‌పహాడ్ మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. మద్దిరాల మండలం కేంద్రంలో సూర్యాపేట-దంతాలపల్లి రహదారిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున రాస్తారోకో చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రమైన భువనగిరి పట్టణంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ తీసి, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రైతులు, ప్రజా సమస్యలపై అసెంబ్లీలో ప్రశ్నించిన మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై సస్పెషన్ విధించడం దుర్మార్గమని చింతల మండిపడ్డారు. రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు కొలుపుల అమరేందర్, భువనగిరి పీఏసీఎస్ మాజీ చైర్మన్లు నోముల పరమేశ్వర్‌రెడ్డి, ఎడ్ల సత్తిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, మాజీ జడ్పీటీసీ బీరు మల్లయ్య, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు తదితరులు పాల్గొన్నారు. బీబీనగర్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఆత్మకూర్.ఎం మండల కేంద్రంలోని మోత్కూర్– భువనగిరి ప్రధాన రహదాపై బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేశారు. బొమ్మలరామారంలోనూ రాస్తారోకో చేశారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. రామన్నపేటలో బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గపు చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, ఇకనైనా ఇలాంటి కుట్రపూరిత ధోరణులు మానుకోకుటే సరైన సమయంలో తగిన గుణపాఠం చెబుతారని నిరసనల సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.

సంస్థాన్ నారాయణపురంలో రోడ్డుపై బైఠాయించిన బీఆర్ఎస్ శ్రేణులు

బీబీనగర్ మండల కేంద్రంలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

భగ్గుమన్న సూర్యాపేట ప్రజానీకం

జగదీశ్‌రెడ్డి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న సూర్యాపేట నియోజవకర్గం మొత్తంగా నిరసనలు వెలువెత్తాయి. ఊరూరా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగాయి. నియోజకవర్గ కేంద్రమైన సూర్యాపేటతోపాటు నాలుగు మండలాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి పదకొండు గంటల మధ్య రెండు గంట వ్యవధిలోనే బీఆర్ఎస్ శ్రేణులతో పాటు సాధారణ ప్రజలు సైతం పెద్దఎత్తున రోడ్లపైకి వచ్చారు. నియోజకవర్గవ్యాప్తంగా 60కి పైనే నిరసనలు జరిగాయి. తమ ఆత్మీయ నేత జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ర్యాలీలు, రాస్తాకోలు, దిష్టిబొమ్మల దహనాలు చేశారు.

ఎంజీయూ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌కు వినతి పత్రం అందిస్తున్న ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు

కాలేజీలు నడుపలేం

- ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలలో జాప్యంపై ప్రైవేట్ కాలేజీల ఆందోళన
- రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలను బహిష్కరిస్తామని హెచ్చరిక
- ఎంజీయూ వీసీ దృష్టికి తీసుకెళ్లిన యాజమాన్యాలు

రామగిరి, మార్చి 15 : ప్రైవేట్ కళాశాలల్లో చదువుకుంటున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాల విడుదలలో తీవ్ర జాప్యాన్ని నిరసిస్తూ యాజమాన్యాలు మరోమారు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే గత అక్టోబర్, నవంబర్‌లో కాలేజీలను బంద్ పెట్టగా.. ప్రభుత్వ హామీతో తిరిగి తరగతులు ప్రారంభించారు. కానీ, ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడంతో కాలేజీలు నడుపలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ శనివారం టీపీడీపీఎంఏ ఎంజీయూ యాజమాన్యాలు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ కలిసి వినతి పత్రం అందించాయి. ఈ సందర్భంగా టీపీడీఎంఏ ఎంజీయూ శాఖ అధ్యక్షుడు, నీలగిరి విద్యా సంస్థల ప్రిన్సిపాల్ మారం నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయన్నారు. అధ్యాపకుల జీతాలు, భవనాల అద్దెలు, కరెంటు బిల్లులు, యూనివర్సిటీ రుసుములు, బిల్డింగ్ ట్యాక్స్ చెల్లించేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించకపోతే త్వరలో జరుగనున్న డిగ్రీ 2, 4, 6 రెగ్యులర్ సెమిస్టర్, 1, 3, 5 బ్యాక్‌లాగ్ పరీక్షలను బహిష్కరిస్తామని తెలిపారు. వినతి పత్రం అందచేసిన వారిలో టీపీడీపీఎంఏ ఎంజీయూ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సైదారావు, సత్యం గౌడ్, జైపాల్‌రెడ్డి, గుండెబోయిన జానయ్య యాదవ్, రాజశేఖర్, నగేశ్, హన్మంతు ఉన్నారు.

బీసీ గురుకులంలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 15 : మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ గురుకుల బాలుర, బాలికల విద్యాలయాల్లో 6, 7, 8, 9వ తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ జెల్లా స్వప్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మోటకొండూరు (బాలికలు), వలిగొండ (బీబీనగర్) బాలికలు, భువనగిరి (తూప్రాన్‌పేట) బాలికలు, రాజాపేట (ఆలేరు) బాలురు, పోచంపల్లి (దేశముఖ్) బాలుర పాఠశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 31లోపు mjptbcwreis.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 20న జరిగే ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

- ఈ యాసంగి ఎవుసం రైతన్నకు కష్టాల కడలిగా మారింది. ఓవైపు భూగర్భ జలాలు ఇంకిపోయి బోర్లు, బావులు వట్టిపోతున్నాయి. కొద్దోగొప్పో బోర్లు పోస్తున్న చోట కూడా విద్యుత్ సమస్యలు వేధిస్తున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో లో ఓల్టేజీ సమస్య రైతులను ఇబ్బందులు పాలు చేస్తున్నది. మోటార్లు, ట్రాన్స్‌ఫార్మార్లు కాలిపోతుడడంతో మరమ్మతుల కోసం మరింత నష్టపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్‌లో నెలకొన్న జాప్యం కారణంగా నీళ్లు అందక పంటలు ఎండిపోతున్నాయి. బీఆర్ఎస్ సర్కారులో నాణ్యమైన నిరంతర విద్యుత్‌తో సంతోషంగా వ్యవసాయం చేసిన రైతులు ఇప్పుడు సమస్యతో కుమిలి పోతున్నారు.

– మునుగోడు/మోత్కూరు, మార్చి 15

మునుగోడులోని టాన్స్‌ఫార్మార్ల మరమ్మతు కేంద్రానికి కాలిపోయిన టాన్స్‌ఫార్మర్ తీసుకొచ్చిన కలువలపల్లి రైతులు

రైతన్నకు కరెంటు కష్టాలు

లో ఓల్టేజీతో కాలిపోతున్న మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు

- విద్యుత్ సమస్యతో నల్లాల్లా పోస్తున్న బోర్లు
- ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల్లో తీవ్ర జాప్యం
- ట్రాన్స్‌కో నిర్లక్ష్యంతో ఎండుతున్న పంటలు
- బీఆర్ఎస్ సర్కారులో విద్యుత్ సమస్యలే లేవని గుర్తు చేసుకుంటున్న రైతులు

మునుగోడు మండలంలో 5,500 ఎకరాల్లో రైతులు వరి నాటు పెట్టారు. బోర్ల ఆధారంగా సాగు చేస్తున్న రైతులు విద్యుత్ లో ఓల్టేజీ సమస్యలతో సతమతం అవుతున్నారు. తరుచూ మోటార్లు , టాన్స్‌ఫార్మార్లు కాలిపోతుండడంతో పొట్ట దశలో నీళ్లు అందక సాగు పంటలు ఎండిపోతున్నాయి. మరోవైపు మరమ్మతుల భారమూ అర్థికంగా దెబ్బ తీస్తున్నది. మండలంలో ఇప్పటికే 1,200 ఎకరాల్లో పంటలు ఎండిపోగా, రైతులు పశువులకు మేతకు వదిలిపెట్టారు. మిగిలిన పంటనైనా కాపాడుకోవాలని భగరీథ ప్రయత్నాలు చేస్తున్నారు. మునుగోడు మండల కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రం ఉన్నా రైతులకు పెద్దగా ప్రయోజనం ఉండడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని రైతులు ఫిర్యాదు చేస్తే ట్రాన్స్‌కో సిబ్బందే వచ్చి మరమ్మతుల కేంద్రానికి తీసుకువెళ్లాల్సి ఉండగా, కనీస స్పందన ఉండడం లేదు. కిందామీద పడి రైతులే ట్రాన్స్‌ఫార్మర్లను తీసుకు వెళ్లినా రిపేర్‌కు మూడు, నాలుగు రోజులు సమయం పడుతుందని చెప్తున్నారు. ఈ జాప్యంతో నీళ్లు అందక పంటలు ఎండిపోతున్నాయి. మునుగోడు మండలం కల్వలపల్లికి చెందిన రైతు గుండబోయి యాదయ్య నాలుగెకరాల్లో వరి సాగు చేస్తే బోర్లలో నీళ్లు తగ్గి రెండెకరాల్లో పంట ఎండింది. మిగిలిన రెండెకరాలు ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్‌తో ఆలస్యం కారణంగా ఎంపోయిందని యాదయ్య తెలిపారు. ఆ ట్రాన్స్‌ఫార్మర్ కింద సాగు చేసిన ఎనిమిది రైతులదీ ఇదే పరిస్థితి అని వివరించారు.మునుగోడుకు చెందిన ఉప్పుత్తుల యాదయ్య అనే రైతు మాట్లాడుతూ 'నాకున్న ఎకరం భూమిలో వరి పెట్టిన. బోరులో నీళ్లు తగ్గడం, కరెంటు కోతల వల్ల పంట పూర్తిగా ఎండిపోయింది. పెట్టుబడి 35 వేల రూపాయలు అయ్యింది. ఆఖరికి అప్పులే మీద పడినయ్' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సరారులో కరెంటుకు ఎన్నడూ సమస్య రాలేదని గుర్తు చేసుకున్నారు.

ఈ ఎండిన వరి చేనులో పశువులను మేపుతున్న ఈ రైతు పేరు పాలకూరి అంజయ్య. ఊరు మునుగోడు మండలం సింగారం. రెండెకరాల్లో వారి నాటు పెడితే నీళ్లు తగ్గి బోరు ఆగి ఆగి పోస్తుండడం వల్ల ఇప్పటికే ఎకరంన్నర పంట ఎండిపోయింది. మిగిలిన అరెకరం అయినా చేతికి రాకపోతుందా అని ఆశతో ఉంటే కరెంట్ లో ఓల్టేజీ సమస్య తీవ్రంగా వేధిస్తున్నదని అంజయ్య వాపోయారు. కరెంట్ ప్రాబ్లెమ్ ఇట్లనే ఉంటే గింజ గూడ దక్కదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకర్గంలోని మోత్కూరు మండలంలో ఎక్కువ మంది రైతులు మూసీ నది, బిక్కేరు వాగులపై ఆధారపడి బోర్లు, బావులతో వరి సాగు చేస్తున్నారు. కానీ, విద్యుత్ సమస్యలు రైతులకు కంటి మీద కునుకు చేస్తున్నాయి. మోత్కూరు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని బుజిలాపురంలో ఒక 132/33 కేవీ సబ్ స్టేషన్, మోత్కూరు మండలంలోని మోత్కూరు, అనాజిపురం, పాలడుగు, ఆత్మకూరు(ఎం) మండలంలో ఆత్మకూరు(ఎం), ఖప్రాయపల్లి, పల్లెర్ల, అడ్డగూడూరు మండలంలో అడ్డగూడూరు, అజీంపేట, చిన్న పడిశాల, గట్టుసింగారం, గుండాల మండలంలో గుండాల, పెద్దపడిశాల, అంబాల, సుద్దాల, వెల్మజాలలో 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లు ఉన్నాయి. కానీ.. లో ఓల్టేజీ, అప్రకటిత విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ఇంగీసమ్మ కుంట పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్ పదే పదే ట్రిప్ అవుతున్నదని తెలిపారు. కరెంట్ సమస్యల కారణంగా పంట చేతికి వచ్చే సమయంలో నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని వాపోతున్నారు. ఈ విషయమై మోత్కూరు ట్రాన్స్‌కో ఏడీఈ బాలునాయక్‌ను వివరణ కోరగా, ఇప్పటికే పలు సబ్ స్టేషన్లలో సాంకేతిక సమస్యలను గుర్తించి రిపేర్ చేశామని, ఎక్కడైనా సమస్యలు ఏర్పడితే గ్రామాల్లోని తమ సిబ్బంది దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

మోత్కూరు ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రానికి వచ్చిన కాలిన ట్రాన్స్‌ఫార్మర్లు

రాజాపేట మండలంలో...

రాజాపేట సోమారంలో లో ఓల్టేజీతో సన్నగా పోస్తున్న బోరు వద్ద రైతు బాలయ్య

రాజాపేట : యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం బొందుగుల సబ్ స్టేషన్ పరిధిలోని గోధుమకుంట ఫీడర్‌లోని 100 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్ కింద 15 బోరు మోటార్ల కనెక్షన్లు ఉన్నాయి. ఈ ఫీడర్ లో తరుచూ లో ఓల్టేజీ సమస్య ఏర్పడుతున్నది. దాంతో బోర్ల నుంచి నల్లా మాదిరి సన్నటి ధారగా వస్తున్నాయి. ఫలితంగా పొలాలు పారక వరి పంటలు ఎండిపోతున్నాయి. జనగాం జిల్లా బచ్చన్నపేట మండలం నారాయణపురానికి చెందిన రైతు జంగిటి బాలయ్య రాజాపేట మండల పరిధిలోని సోమవారం పరిధిలో ఒక బోర్ల కింద నాలుగెకరాలు వరి సాగు చేశారు. కరెంట్ లో ఓల్టేజీతో కారణంగా మోటార్లు నడవక పొట్ట దశలో పంట ఎండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులను పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు.

లో ఓల్టేజీతో మోటార్లు కాలుతున్నయ్

పల్లెర్ల సబ్ స్టేషన్ పరిధిలో లో ఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉంది. వ్యవసాయ మోటార్లు, స్టార్టర్లు తరుచూ కాలి పోతున్నాయి. దాంతో పంటలకు నీటి సమస్య ఎదురతున్నది. రిపేర్‌కు డబ్బులు ఖర్చవుతున్నాయి. సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తేనే పంటలు దక్కుతాయి.

-కోరె భిక్షపతి, రైతు, ఆత్మకూరు(ఎం)

కాలిన మోటార్లు రోజుకు మూడు, నాలుగు వస్తున్నయ్

త్రీఫేస్ కరెంట్ సరిగ్గా సరఫరా రాకపోవడం వల్లే మోటార్లు కాలిపోతున్నాయి. ఒక్క ఫేస్‌లో కరెంట్ తక్కువ సరఫరా కావడం వల్ల మోటార్లు వేడెక్కి రిపేర్‌కు వస్తున్నాయి. ఇలా కాలిన మోటార్లు రోజుకు మూడు, నాలుగు వస్తున్నాయి.

-చెరుకు రాములు, మోటార్ మెకానిక్, మోత్కూరు